# సింగిల్ పేజీ కథలు

## గురివింద

విశాఖపట్నం స్టేషన్‌కి చాలా హడావుడిగా చేరుకున్నాను. టైమ్‌కోసం వాచ్ చూసుకునేసరికి గోదావరి ఎక్స్‌ప్రెస్ బయల్దేరడానికి ఇంకా అరగంటే టైముంది. ఇంకా ప్లాట్‌ఫారం మీదకి ట్రైన్ రాకపోయేసరికి 'ఈరోజు లేటుందేమోలే' అనుకున్నాను. ఇంతలో అనౌన్స్‌మెంట్ వినిపించింది, గోదావరి ఎక్స్‌ప్రెస్ ఒకటవ నంబరు ప్లాట్‌ఫారం మీదకి రాబోతోందని. జేబులోంచి టిక్కెట్ తీసి నంబరు చూసుకొన్నాను. ట్రైన్ ఆగాక నెమ్మదిగా నా బెర్తు ఎస్-4, 62లో కూర్చున్నాను.



ఇంతలో పక్కబెర్త్ నుండి కేకలు వినబడటంతో అటుచూశాను. ఒక నడివయసు అతను అరుస్తున్నాడు. నలభై పైన ఉంటుంది అతని వయసు. ''డబ్బు కావాలంటే అడుక్కోరా. అంతేకాని ఇలా అందరినీ మోసం చేయకు'' అని. 'ఫట్'మని శబ్దం వచ్చేలా కొట్టాడు కూడా. దెబ్బ తిన్న కుర్రాడు 'ఛాయ్' అమ్మేవాడు.

''ఇంతకీ వీడు చేసిన మోసం ఏంటండీ?'' అడిగాడు అతని పక్కనున్నతను. ''ఛాయ్‌కని పది రూపాయలిచ్చాను. చిల్లర లేదంటూ అర్ధరూపాయి తగ్గించి ఇచ్చాడు. ఈ పక్కనే ఉన్నతనికి కూడా అలాగే చేశాడు. తీరా చూస్తే వాడి జేబునిండా చాలా చిల్లరుంది. ఇలా మోసం చేసేవారంటే నాకు చాలా చిరాకు'' అన్నాడు.

ఓస్ ఇంతేనా? అన్నట్టుంది ఆ ప్రశ్నించినతని ముఖం. నాకూ అలానే అనిపించింది.

''అలాగే సార్. ఇంకెప్పుడూ ఇలా చేయను'' అంటూ చిల్లర ఇచ్చేసి వెళ్తున్న ఆ కుర్రాడి ముఖం చూస్తే నాకు జాలేసింది.

కొంతసేపటికి టి.టి.ఇ వచ్చాడు. అందరి టిక్కెట్లు చెక్ చేస్తున్నాడు.

ఇందాక ఛాయ్ కుర్రాడ్ని చెంప ఛెళ్ళుమనిపించినతని వంతు వచ్చింది. టి.టి.ఇ టిక్కెట్ అని అడగబోయేంతలో అతను లేచి బాత్రూమ్ వైపు వెళ్తున్నాడు.

నేనూ, ఇందాక ప్రశ్నించినతనూ అతనివైపే చూస్తున్నాం.

''ఏయ్ మిస్టర్? మీ టిక్కెట్ చూపించండి'' టి.టి.ఇ అడిగాడు.

''అదీ సార్! మీరు ఒక్కసారి ప్రక్కకి వస్తే మాట్లాడాలి'' గుసగుసలాడుతున్నట్టుగా చెప్పాడు టి.టి.ఇ చెవిలో.

మొదట ఇరవై రూపాయల నోటు అందించాడు టి.టి.ఇకి. అతను తల అడ్డంగా ఊపాడు. ''అదికాదండీ, ఇది కూడా ఉంచండి ప్లీజ్'' అంటూ మరోనోటు అందించాడు.

టి.టి.ఇ అతనిని వదలి తర్వాత వాళ్ళ దగ్గరకెళ్ళాడు. మేమిద్దరం ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నాం.

**-పుప్రేవు శ్రీనివాసరావు** (హైదరాబాద్)

## మోసం

''సార్..'' అన్న పిలుపు విని వేగంగా నడుస్తున్న రంజిత్ కాస్త ఆగి వెనక్కి తిరిగి చూశాడు. కాలేజీలో క్లర్క్‌గా పనిచేస్తున్న గణేశ్‌ను చూసి ప్రతి నమస్కారం చేసి ఏమిటి అన్నట్లు అతని వైపు చూశాడు.

''మీ అమ్మాయి డిగ్రీ ఫైనలియర్ పరీక్ష రాసిందనుకుంటాను సార్'' ఎంక్వయిరీ చేస్తున్నట్లు, ఆత్మీయత ఉట్టిపడుతున్నట్టుగా అడిగాడు గణేశ్.

''అవును. ఓ పేపర్ రాసిందనుకుంటాను'' జ్ఞాపకం చేసుకుంటూ బదులిచ్చాడు రంజిత్.

''నిన్న యూనివర్సిటీకి వెళ్లాను సార్'' అని ఏదో విశేషం చెప్పబోతున్నట్టుగా మొదలుపెట్టాడు గణేశ్.

''ఏమిటి విశేషం?'' అని రంజిత్ కుతూహలంగా ప్రశ్నించాడు.

''మీ అమ్మాయికి వచ్చినమార్కులు చూశాను సార్. చాలా తక్కువ వచ్చాయండీ'' అంటూ గణేశ్ ముఖం అదోలాపెట్టాడు.

''అలాగా! ఎన్ని వచ్చాయి'' ఆత్రంగా ప్రశ్నించాడు రంజిత్.

''ఇరవై ఏడు సార్'' అన్నాడు గణేశ్.

కాస్సేపు విచారంతో మౌనం పాటించి రంజిత్ మరలా ఇలా అన్నాడు. ''మరి రీటోటలింగ్‌కు ప్రయత్నిస్తే ప్రయోజనం ఉంటుందంటారా?'' అని సలహా అడిగాడు.

''ఏమీ లాభం లేదుసార్. మరో పనిచేయడం మంచిది సార్'' ఏదో సలహా ఇస్తున్నట్లన్నాడు గణేశ్.

''ఏమిటో చెప్పు'' తొందరపెట్టసాగాడు రంజిత్.

''నాకు బాగా ఆత్మీయుడైన ఒకతను యూనివర్సిటీలో ఉన్నాడు. ఆయనకు ఫోన్ చేసి ఏం చేస్తే బాగుంటుందో కనుక్కొని మీకు ఫోన్ చేస్తానండీ'' అంటూ రంజిత్ ఫోను నెంబరు తీసుకొని వెళ్లిపోయాడు గణేశ్.

సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకు ఫోన్ రింగయింది రంజిత్ ఇంట్లో. అది తప్పకుండా గణేశ్ నుండే అయివుంటుందనుకొని రిసీవర్ ఎత్తాడు రంజిత్.

''నేను సార్ గణేశ్‌ని. యూనివర్సిటీకి ఫోన్ చేసి విచారించానండీ. నాకు తెలిసినాయన రీ టోటలింగ్‌కు ప్రయత్నించడంవల్ల ఏమీ లాభం ఉండదనీ,

అంతకు మునుపు వచ్చిన మార్కులే సరియైనవనీ బదులు ఇస్తారనీ అన్నాడాయన''

''మరేమి చేయమంటారో చెప్పండి'' ఆత్రంగా అడిగాడు రంజిత్.

''మీరేమీ అనుకోనంటే ఓ మాట చెబుతానండీ'' అన్నాడు గణేశ్.

''చెప్పండి'' అని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు రంజిత్.

''మీరు కొంత డబ్బు ఖర్చు చేస్తే పాస్ మార్కులు వస్తాయండీ'' ఆశకల్పిస్తూ అన్నాడు గణేశ్.

''ఏమాత్రం?'' సిద్ధపడినట్లుగా అన్నాడు రంజిత్.

''అయిదు వందలిస్తే పాస్ మార్కులు వేయిస్తాడటండీ. ఇంతకుముందే ఆయన ఫోన్లో ఆ విషయం చెప్పాడు. మీరు అంగీకరిస్తే ఆ విషయం అతనికి తెలియజేస్తాను. తప్పకుండా మీ పని నెరవేరుతుందండీ. ఏ నిర్ణయమూ మీరు ఓ అరగంటలో తెలియజేయండి'' అంటూ ఫోన్ పెట్టేశాడు గణేశ్.

రంజిత్ ఈ విషయమై భార్యతో చర్చించాడు. ఆమెకూడా రీటోటలింగ్ ఫీజూ, పోస్టల్ ఖర్చులు, ఆ తర్వాత పరీక్ష ఫీజు వగైరాలు తడిసి మోపెడవుతాయనీ దానికంటే ఇదే బాగుందండీ అనీ, డబ్బు విషయంలో కాస్త బేరమాడి తగ్గించమని సలహా ఇచ్చిందామె.

వాళ్ల సంభాషణ వింటున్న కుమార్తె మమ్మీ చెప్పినట్లే చేయమంది.

రంజిత్‌కు కూడా తన భార్య నిర్ణయం సబబుగానే తోచింది.



అరగంట తర్వాత గణేశ్‌కు ఫోన్ చేసి తన నిర్ణయం తెలిపాడు రంజిత్. కానీ డబ్బు కాస్త తగ్గించమని బేరమాడాడు. ఆయన ఓ వంద తగ్గించగా రంజిత్ ఖరాఖండీగా రెండొందలిస్తానని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

రెండు రోజులు గడిచాయి. గణేశ్ కనబడి మార్కుల మెమోలు వచ్చాయనీ మీ అమ్మాయికి నలభై ఏడు మార్కులు వచ్చాయనీ అమ్మాయిని కాలేజీకి పంపితే మార్కుల మెమో ఇస్తాననీ చెప్పాడు.

రంజిత్ కూతురు రెండొందలు గణేశ్‌కు సమర్పించి మార్కుల మెమో తెచ్చుకుంది.

ఆ మర్నాడు అనుకోకుండా రంజిత్ బాల్య స్నేహితుడు రాకేష్ కనబడ్డాడు. ఇద్దరూ పలకరింపులూ, క్షేమ సమాచారాలు మాట్లాడుకున్నాక ''రాకేష్ నీవిప్పుడు ఏం చేస్తున్నావు?'' అని అడిగాడు. రాకేష్ తాను యూనివర్సిటీలో పరీక్షా విభాగంలో పనిచేస్తున్నానని చెప్పాడు.

''మార్కులు వేయించేందుకుగానీ, మార్చేందుకు గానీ అవకాశం ఉందా?'' అని రాకేష్‌ని అడిగాడు రంజిత్.

''అలాంటి పరిస్థితులే లేవనీ కొందరు అలా మార్కులు వేయిస్తామని డబ్బులు గుంజి మార్కుల మెమోలో మార్కుల కంటే తక్కువ చెప్పి నాలుగయిదురోజులు పోయాక మార్కులు వేయించామని చెప్పి మోసం చేస్తుంటారు'' అని చెప్పాడు రాకేష్.

రాకేష్ మాటలు విన్న రంజిత్ అవాక్కయిపోయాడు.

గణేశ్ నాటకం తెలిసిపోయింది. అయితే ఏం లాభం చేతులు కాలాక..

**-కరణం రాజేశ్వరరావు** (శ్రీకంఠాపురం)

# పాలబతుకు

''ఒరేయ్ శీనుగా లేవరా. తెల్లారి వెలుగొచ్చినా ఆ మొద్దు నిద్ర ఏంటిరా. లే.లే. వెళ్ళి పాలు తేవాలిరా నాయనా!'' అంటూ అమ్మకుదిపి, కుదిపి లేపేసరికి పడుకోవాలని ఎంత బలంగా అనిపించినా తప్పదని లేచాడు పదేళ్ళ శీను!

రోజూ పొద్దున్నే లేచి రెండు వీధులవతల ఉన్న పాలసుబ్బమ్మ ఇంటికి వెళ్ళి బర్రెపాలు తీసుకురావాలి. తనకేమో ఉదయాన్నే హాయిగా పడుకోవాలనే ఆశ. ఆ ఆశపై నీళ్ళు చల్లుతూ- ''పాలుతేరా...పాలుతేరా'' అంటూ అమ్మ గొణుగుడు. రోజూ తనకిది చిరాకు కలిగించే విషయం! అయినా తప్పదు.

వెళ్ళకపోతే బామ్మ మొదలుపెడుతుంది దండకం. ''పదేళ్ళు వచ్చాయి. మగపిల్లాడు ఆ మాత్రం పాలు తేలేడు'' అంటూ. ఆపదు మరి. అవిడకి సూర్యోదయంతోపాటు, కాఫీ గ్లాసు చేతిలో ఉండాలి మరి! ఏతావాతా ఈ పాల బారిన పడ్డాడు పాపం శీను.

అలా బాల్యం గడిచిపోయింది. యవ్వనంలో ప్రవేశించాడు. కాలేజీలో చేరాడు. అయినా రోజూ తనే తేవాలి పాలు. ఎలాగో డిగ్రీ అయిందనిపించి ప్రైవేటు కంపెనీలో గుమాస్తాగిరి వెలగబెట్టసాగాడు. తల్లిదండ్రుల అభీష్టం మేరకు మేనత్తకూతురు పద్మని వివాహం చేసుకున్నాడు.

హమ్మయ్య ఇకనైనా తనకి ఈ పాలగోల తప్పుతుందేమో అనుకున్నాడు. కానీ, చిత్రంగా రోజూ ఉదయాన్నే శ్రీమతిపద్మ ''బావా లేబావా, పాల



కేంద్రానికి వెళ్ళి పాలు తేవాలి'' అంటూ పాలకొలుపులు పాడసాగింది.

''అబ్బా పద్మా, ఇంటికి వచ్చి పోసేవాళ్ళ దగ్గర పోయించుకోవోయ్'' అన్నాడు ఓ రోజు

''ఆ..వాళ్ళు ఓ రోజు నీళ్ళు, ఓ రోజు పాలు పోస్తారు. మీరు చేసే నిర్వాకం ఏంటట. ఎనిమిది వరకూ కుంభకర్ణుడిలాగా నిద్రపోవటానికేగా ఈ వేషాలు'' అనేసింది తేలికగా!

''హతోస్మి'' అని నిటూర్చాడు పాపం శీను!

పిల్లలు పుట్టారు. పెరిగారు. చదువుకున్నారు. మంచి మంచి ఉద్యోగాల్లో చేరారు. అయినా తనకి పాలు తేవటం తప్పలేదనుకున్నాడు శీను.

ఉద్యోగంలోంచి రిటైరు అయ్యాక ధర్మంగా ఇద్దరు కొడుకులూ చెరో ఆరునెలలు తమని పంచుకున్నారు. హాయిగా ఏ గుళ్ళో, గోపురాలో తిరుగుతూ, మంచి మంచి గ్రంథాలు ఈ వయసులో అయినా చదువుకోవచ్చును అనుకుంటే ఆ ఆశ అడియాసే అయింది శ్రీనివాసరావుగా మారిన శీనుకి!

ఎవరింట్లో వుంటే వాళ్ళకి జీతం భత్యం లేని నౌకరులాగా, ఉదయాన్నే లేచి పాలప్యాకెట్లు తేవటంతోనే దినచర్య ప్రారంభం అవుతోంది శీనుకి.

'ఏంటో ఈ పాలబతుకు. నేను పాడె ఎక్కేదాకా ఈపాల డ్యూటీ తప్పదేమో ' అనుకుంటాడు అరవై ఏళ్ళ వయసులో పాపం, శ్రీనివాసరావు!

**-కాకరాల భానుమతి** (హైదరాబాద్)